క్లుప్తంగా

పేదలకు వస్త్రాల పంపిణీ



ఆత్మకూరు: యేసుక్రీస్తు ఉపవాస ప్రార్థనా కూడిక సందర్భంగా మున్సిపల్ పరిధిలోని టిడ్కో గృహాల వద్ద పేద మహిళలకు ఆదివారం వస్త్రాలు పంపిణీ చేశారు. చెన్నైకు చెందిన క్రిస్టియన్ సంస్థ సహకారంతో వస్త్రాలను పంపిణీ చేసినట్లు పాస్టర్ కే స్టీఫెన్ తెలిపారు. న్యాయవాది ఎస్కే నజీర్ పాల్గొన్నారు.

ఎస్ఏ-1 పరీక్ష పత్రాల అందజేత

ఆత్మకూరురూరల్: సంక్రాంతి సెలవులకు ముందు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో నిర్వహించిన ఎస్ఏ-1 పరీక్షల జవాబు పత్రాలను విద్యార్థుల తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు శనివారం అందజేశారు. తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి విద్యార్థుల అభ్యాసనాభివృద్ధిని తెలియజేశారు. భవిష్యత్‌లో విద్యార్థులు మరింత బాగా చదివేందుకు తల్లిదండ్రులు తమ వంతు సహకారం అందించాలని కోరారు.

ఈక్రాప్ నమోదు నూరుశాతం చేపట్టాలి



వరికుంటపాడు: ఈక్రాప్ నమోదు లక్ష్యాన్ని నూరు శాతం పూర్తిచేయాలని మండల వ్యవసాయాధికారి జీ కిరణ్ అన్నారు. స్థానిక రైతు భరోసాకేంద్రాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఆర్బీకే సేవలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఆర్బీకేల్లో రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట వీఏఏ చంద్రశేఖర్ ఉన్నారు.

వలంటీర్లకు ఇంటర్వ్యూలు



వరికుంటపాడు: మండల పరిషత్ కార్యాలయంలో వలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఎంపీడీఓ విజయభాస్కర్ రావు శనివారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలంలోని ఏడు పంచాయతీల్లోని 14 వలంటీర్ పోస్టులకు 19 మంది దరఖాస్తు చేసుకోగా, 16 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. అందులో 11 మందిని వలంటీర్ పోస్టులకు ఎంపిక చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు. నల్లబోతుల వారిపల్లెకాలనీలోని రెండు ఖాళీలకు ఒకే అభ్యర్థి దరఖాస్తు చేశాడు. ఇంటర్వ్యూకు హాజరు కాలేదు. అలాగే వేంపాడు ఖాళీకి ఎవరూ దరఖాస్తు చేయలేదు. జూనియర్ అసిస్టెంట్ బీ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం



ఘటనా స్థలంలో పెంచలయ్య మృతదేహం

చేజర్ల: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం అర్ధరాత్రి మండలంలోని ఆదూరుపల్లి సెంటర్‌లో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు.. కలువాయి మండలం కేసీ గోపవరం గ్రామానికి చెందిన కాకుమూరు పెంచలయ్య (60) ఐదేళ్లుగా చెప్పులు కుట్టుకొని జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం అర్ధరాత్రి ఆదూరుపల్లి వద్ద అతను రోడ్డుపై నడుచుకొంటూ వెళుతుండగా గుర్తుతెలియని వాహనం వేగంగా ఢీకొంది. ప్రమాదానికి కారణమైన వాహనం ఆపకుండా వెళ్లి పోయింది. స్థానికులు ఆ వాహనాన్ని గుర్తించే ప్రయత్నం చేసినా చీకటిగా ఉండడంతో గుర్తించలేకపోయారు. శనివారం ఉదయాన్నే ఘటనా స్థలానికి సీఐ రవినాయక్, ఎస్ఐ మరిడినాయుడు చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): బాకీ విషయమై స్నేహితుడిపై హత్యాయత్నానికి పాల్పడిన ఘటనలో నిందితులను నవాబుపేట పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. బాకీ విషయమై కొత్తకాలువ సెంటర్‌కు చెందిన పవన్‌పై ఆత్మకూరు బస్టాండ్ వెనుక వై పున స్నేహితులు రాము, మోహన్, సంతోష్, విజయ్ హత్యాయత్నానికి గురువారం పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు.

జీవన ప్రమాణాల మెరుగునకు చర్యలు

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి



కుట్టుశిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

బిట్రగుంట: కప్పరాళ్లతిప్ప గత చరిత్రను మార్చేలా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. కప్పరాళ్లతిప్పలోని మహిళలకు స్వయం ఉపాధి కల్పించే దిశగా స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో డీఆర్డీఏ, వైఎస్సార్‌సీపీ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టుశిక్షణా కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కప్పరాళ్లతిప్పను అభివృద్ధి చేయడంతో పాటు స్థానిక యువత, మహిళలకు మెరుగైన ఉపాధి అవకాశాలు, గౌరవప్రదమైన జీవనం అందించే దిశగా ఇప్పటికే పలుమార్లు కలెక్టర్, ఎస్పీతో చర్చించినట్లు తెలిపారు. స్థానిక యువతకు వృత్తి విద్యా కోర్సులు, స్వయం ఉపాధిరంగాల్లో శిక్షణనిచ్చి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు డీఆర్డీఏ ఆధ్వర్యంలో పలు సంస్థలు, పరిశ్రమలతో చర్చిస్తున్నామని వివరించారు. స్వయం ఉపాధి అవకాశాలు పెంపొందించే దిశగా ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. స్థానిక మహిళలకు టైలరింగ్‌లో శిక్షణనిచ్చి సర్టిఫికెట్లు అందించేలా కుట్టుశిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. స్థానిక మహిళలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కావలి ఏఎంసీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్, ఎంపీపీ మేకల సుజాత, జెడ్పీటీసీ మద్దిబోయిన కీర్తన, వైస్ఎంపీపీ మద్దిబోయిన పద్మావతి, ఏఎంసీ డైరెక్టర్ సుష్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దిబోయిన వీరరఘు, మేకల శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యులు సుందరరాజ్, కోఆప్షన్ సభ్యులు నాయబ్ రసూల్, డీఆర్డీఏ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యం



మాట్లాడుతున్న కొడవలూరు ధనుంజయరెడ్డి

దుత్తలూరు: వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని ఆ పార్టీ ఉదయగిరి నియోజకవర్గ పరిశీలకుడు కొడవలూరు ధనుంజయరెడ్డి పిలుపునిచ్చారు. దుత్తలూరులో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ శ్రేణులు సమష్టిగా 2024 ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేయాలనే సంకల్పంతో పనిచేయాలన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతిఒక్కరికీ అందేలా చూడాలన్నారు. అనంతరం పంచాయతీల వారీగా నాయకులతో ఏకాంతంగా చర్చించి అభిప్రాయాలు తీసుకున్నారు. అధిష్టానం ఆదేశాల మేరకు నాయకులు, కార్యకర్తల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు తాను ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తన స్థాయిలో పరిష్కరించగలిగే సమస్యలను వెంటనే పరిష్కరిస్తామన్నారు. సొసైటీ అధ్యక్షుడు చేజర్ల చలమారెడ్డి, ఉండేల గురవారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వాసిపల్లి వెంకటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేద ఖైదీలకు ఉచిత న్యాయసాయం



ఖైదీలతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి రాజేష్

ఆత్మకూరు: పేద ఖైదీలకు ప్రభుత్వం ఉచితంగా న్యాయసాయం అందిస్తోందని సీనియర్ సివిల్ జడ్జి బీ రాజేష్ పేర్కొన్నారు. ఆత్మకూరు సబ్ జైలును శనివారం ఆయన సందర్శించారు. జైలులో కల్పిస్తున్న సౌకర్యాలను ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను రుచి చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షణికావేశంలో నేరాలు చేసి జైలుకు వచ్చిన వారు సత్ప్రవర్తనతో మెలిగితే శిక్ష తగ్గుతుందన్నారు. న్యాయవాదిని ఏర్పాటు చేసుకునే స్థోమత లేని పేద ఖైదీలు దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం న్యాయసాయం అందిస్తుందని వివరించారు. ఆయన వెంట జైలు సూపరింటెండెంట్ ఎం విజయ్‌కుమార్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

సిమెంట్ లోడు ట్యాంకర్ బోల్తా



ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని టిడ్కో గృహాల సమీపంలో శనివారం వేకువన సిమెంట్ లోడు ట్యాంకర్ అదుపుతప్పి బోల్తాపడింది. కృష్ణపట్నం పోర్టు నుంచి వైఎస్సార్ జిల్లాకు సిమెంట్‌ను తరలిస్తున్న ట్యాంకర్ డ్రైవర్ నిద్ర మత్తులోకి జారుకోవడంతో అదుపుతప్పి తూమును ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్యాంకర్ బోల్తాపడగా, క్యాబిన్ మాత్రం రోడ్డుపైనే నిలిచింది. అప్రమత్తమైన డ్రైవర్ దూకేయడంతో ప్రమాదం తప్పింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాసమస్యలపై అలుపెరగని పోరాటం



మాట్లాడుతున్న దామా అంకయ్య

ఆత్మకూరు: భారత కమ్యూనిస్ట్ పార్టీ ప్రజాసమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తోందని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దామా అంకయ్య అన్నారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని దించేందుకు కలిసి వచ్చే అన్ని పార్టీలను కలుపుకొని పోరాటం చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను బీజేపీ ప్రభుత్వం ప్రైవేట్‌పరం చేయడం దారుణమన్నారు. పార్టీ నాయకులు నారాయణ, మాబాషా, రామసుబ్బారెడ్డి, నాయబ్‌బాషా, మహేష్, పుల్లయ్య, మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

వాహనచోదకులు అప్రమత్తంగా ఉండాలి



ఆత్మకూరు: ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై ఎం శివశంకర్‌రావు



కావలిరూరల్: రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ సుందర్‌రావు

కావలి రూరల్: వాహనచోదకులు అప్రమత్తంగా ఉండాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సుందర్‌రావు అన్నారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని లారీ ఓనర్స్ అసోసియేషన్ భవనంలో శనివారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ డ్రైవర్లు డ్రైవింగ్ సమయంలో ప్రశాంతంగా ఉంటే ఎలాంటి ప్రమాదాలు జరగవన్నారు. భారీ వాహనాలు నడిపే డ్రైవర్లు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్టులు ధరించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ విధిగా ధరించాలన్నారు. ఆర్సీ, లైసెన్స్‌లను వెంట ఉంచుకోవాలన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని హెచ్చరించారు. వాహనాలు నడిపే సమయంలో సెల్‌ఫోన్ వినియోగించవద్దని సూచించారు. అనంతరం ఆటో, లారీ డ్రైవర్లకు వైద్యపరీక్షలు నిర్వహించారు. డీఎస్పీ వెంకటరమణ, ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసులు, డ్రైవర్లు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి

ఆత్మకూరు: ఆటో డ్రైవర్లు రోడ్డు భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆత్మకూరు ఎస్సై ఎం శివశంకర్‌రావు అన్నారు. మున్సిపల్ బస్టాండ్‌లో ఆటో డ్రైవర్లకు రహదారి భద్రతపై శనివారం అవగాహన కల్పించారు. డ్రైవింగ్ సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రయాణికుల ప్రాణాలను దృష్టిలో ఉంచుకుని వాహనాలను నడపాలన్నారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న సర్పంచ్ సుజన

వింజమూరు: ఇటీవల మృతి చెందిన వింజమూరు పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడు జీ ఆదినారాయణ కుటుంబానికి సర్పంచ్ సుజన, ఉపసర్పంచ్ జయలక్ష్మి శనివారం రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. గత 25 ఏళ్లుగా పారిశుద్ధ్య కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్న ఆదినారాయణ నాలుగు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ క్రమంలో ఆదినారాయణ కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. పంచాయతీ కార్యదర్శి శీనయ్య, మిడదాల రాజారామిరెడ్డి, రాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

ఆత్మకూరురూరల్: మండలంలోని బట్టేపాడులో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆదివారం పర్యటించనున్నట్లు పీఏసీఎస్ అధ్యక్షుడు వాసిపల్లి లక్ష్మీరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతనంగా నిర్మించిన సొసైటీ భవనాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరుకావాలని కోరారు.

బ్యాంక్ మేనేజర్‌కు వినతి



సోమశిల: కెనరా బ్యాంకు ఖాతాదారులకు లావాదేవీలకు సంబంధించిన పాస్‌బుక్‌ను ప్రింటింగ్ తీసి ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు అనంతసాగరం కెనరా బ్యాంకు మేనేజర్‌కు శనివారం వినతిపత్రం సమర్పించారు. ఖాతాదారులు పాస్‌బుక్ ప్రింట్ చేసి ఇవ్వాలని కోరితే బ్యాంకు సిబ్బంది ప్రింటర్ పనిచేయడం లేదని చెబుతుండడంతో వారు ఇబ్బందులు పడుతున్నారని మేనేజర్ దృష్టికి తీసుకొచ్చారు. నాయకులు అన్వర్‌బాషా, పెంచలయ్య, వెంకటేష్ ఉన్నారు.

వ్యాక్సినేషన్



ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని ఎల్ఆర్‌పల్లి గిరిజన, ఉలవదిబ్బ మైనార్టీ కాలనీల్లో శనివారం వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఐదేళ్లలోపు చిన్నారులకు 17 రకాల రోగాలు సంక్రమించకుండా ముందస్తుగా వ్యాక్సిన్లు వేస్తున్నట్లు ఏఎన్ఎం పద్మావతి తెలిపారు. గర్భిణులకు సంపూర్ణ ఆరోగ్యవంతులైన పిల్లలను ప్రసవించేలా టీకాలు వేస్తున్నామన్నారు. వైద్యారోగ్య సిబ్బంది పద్మావతి, బాషా, ఆశా కార్యకర్తలు రమణమ్మ, మహబూబ్‌జాన్, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాలను తరలిస్తే కఠిన చర్యలు



మర్రిపాడు: చేపలకు మేతగా వేసేందుకు చికెన్ వ్యర్థాలను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై విశ్వనాథరెడ్డి హెచ్చరించారు. బద్వేల్ నుంచి నెల్లూరు వైపు చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న మూడు ట్రక్కు ఆటోలను శనివారం ఆయన స్వాధీనం చేసుకున్నారు. ట్రక్కు ఆటోలపై కేసులు నమోదు చేసి అందులోని వ్యర్థాలను సమీప అటవీ ప్రాంతంలో పూడ్చించినట్లు ఎస్సై తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక



కార్తీక్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి కాకాణి, ఎంపీలు వేమిరెడ్డి, ఆదాల, ఎమ్మెల్యే రామిరెడ్డి

కావలి: పట్టణానికి చెందిన పలువురు యువకులు కార్తీక్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో శనివారం చేరారు. ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నివాసంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి యువకులకు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్రంలోని యువశక్తిపై అపారమైన నమ్మకం ఉందన్నారు. యువకులకు వివిధ రంగాల్లో నైపుణ్యాలను పెంపొందించి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. పార్టీ నాయకులు మన్నెమాల సుకుమార్‌రెడ్డి, ఈతముక్కల చంద్రశేఖర్‌రెడ్డి, పానుగోటి అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్ రామ్ జయంతి వేడుకలు



డాక్టర్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

కావలి రూరల్: ప్రజావైద్యుడు డాక్టర్ రామ్ జయంతి వేడుకలను పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామ్‌సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ నెల్లూరులోని రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాల వ్యవస్థాపకుడు డాక్టర్ రామ్ అన్నారు. వైద్యుడి వద్దకు రోగి కాకుండా రోగి వద్దకే వైద్యుడు వెళ్లాలనే నినాదంతో ఎందరో డాక్టర్లను తీర్చిదిద్దారన్నారు. పేద ప్రజలకు ఉచిత వైద్యం అందిస్తూ వారి హృదయాల్లో నిలిచిపోయారన్నారు. బీడీ, రిక్షా కార్మికుల సమస్యలపై ఉద్యమాలు సాగించి వారికి న్యాయం చేశారన్నారు. రామ్‌సెంటర్ డైరెక్టర్ తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, మహిళా సంక్షేమ కార్యదర్శి శైలజ, పవన కుమారి, కల్పన, అంగన్‌వాడీకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అగ్గితెగులుపై అప్రమత్తంగా ఉండాలి



ఉదయగిరి: లింగాకర్షక బుట్టలపై అవగాహన కల్పిస్తున్న ఏడీ వెంకటేశ్వర్లు



అల్లూరు: రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ

అల్లూరు: వరిలో వచ్చే అగ్గితెగులుపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ వేణుగోపాల్‌రావు సూచించారు. ఇస్కపల్లి తూముల వద్దనున్న వరి పొలాల్లో పొలంబడి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ రైతులకు వరిపంటలోని శత్రు, మిత్ర పురుగులపై అవగాహన కల్పించారు. విచ్చలవిడిగా రసాయన మందులు వినియోగించడం వల్ల పంటకు మేలు చేకూర్చే మిత్ర పురుగులు చనిపోయే ప్రమాదం ఉందన్నారు. మిత్ర పురుగులను కాపాడుకోవాలన్నారు. అగ్గి తెగులును గుర్తించి సస్యరక్షణ చర్యలు సూచించారు. ముందస్తుగా విత్తన శుద్ధితో అగ్గి తెగులును నివారించవచ్చని తెలిపారు. సమగ్ర ఎరువుల యాజమాన్యం, భూసంరక్షణ పద్ధతులపై అవగాహన కల్పించారు. వీఏఏలు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు కీలకం

ఉదయగిరి: మండలంలోని బిజ్జంపల్లెలో మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. వరి పంటను పరిశీలించి కాండం తొలుచు పురుగు ఉన్నట్లు గుర్తించి నివారణకు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తక్కువ పురుగు మందులతో ఆరోగ్యవంతమైన పంటలు పండించాలన్నారు. విత్తనశుద్ధి, పంట మార్పిడితో తెగుళ్లను నివారించవచ్చని తెలిపారు. వీఏఏ కనిష్క, రైతులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ అందరివాడు

- రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్



విక్టర్ ప్రసాద్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి రూరల్: ప్రస్తుత సమాజంలో అంబేడ్కర్‌ను ఒక సామాజిక వర్గానికే పరిమితం చేస్తుండడం దురదృష్టకరమని, ఆయన అందరివాడని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో అభ్యుదయ ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో శనివారం రాత్రి శరణం గచ్ఛామి నాటికను ప్రదర్శించారు. ఈ నాటిక ప్రదర్శనకు విక్టర్ ప్రసాద్, ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. దేశంలోని ప్రతిఒక్కరికీ ఓటు హక్కుతో పాటు రాజ్యాగం ద్వారా అనేక హక్కులు కల్పించిన మహోన్నతమైన వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. దేశ ప్రజలను ఐక్యం చేసి మనుషులంతా ఒక్కటేనని ప్రపంచ దేశాలకు చాటిచెప్పారన్నారు. నేటి యువత అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ఓటు హక్కును వినియోగించుకుని మంచి నాయకులను ఎన్నుకోవాలన్నారు. అనంతరం రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జీవిత చరిత్రను ప్రదర్శించారు. ఆర్డీఓ శీనా నాయక్, ఏఎంసీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు మన్నెమాల సుకుమార్‌రెడ్డి, కావలి రూరల్ సీఐ రాజేష్, తహసీల్దార్ మాధవరావు, ఎంపీడీఓ సుబ్బారావు, దళిత సోదరులు, తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి



గృహాల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుంటున్న ఆర్డీఓ సాధు కరుణకుమారి



అల్లూరు: గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి మృదులత



సంగం: పంచాయతీ కార్యదర్శులతో సమీక్షిస్తున్న ఎంపీడీఓ గోపి

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని వైఎస్సార్ జగనన్న కాలనీ లేఅవుట్లలో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆర్డీఓ సాధు కరుణకుమారి హౌసింగ్ సిబ్బందిని ఆదేశించారు. మున్సిపల్ పరిధిలోని నెల్లూరుపాళెం, పమిడిపాడు లేఅవుట్లను శనివారం ఆమె సందర్శించారు. గృహ నిర్మాణాల పురోగతిని హౌసింగ్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఉగాది నాటికి రూఫ్‌లెవల్‌కు గృహ నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు. ప్రతి శనివారం హౌసింగ్ డే సందర్భంగా తాను స్వయంగా లేఅవుట్లను సందర్శించి నిర్మాణ పనులు పురోగతిని పరిశీలిస్తానని తెలిపారు. ఆమె వెంట మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

సంగం: మండలంలో జగనన్న గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ గోపి ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో శనివారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. జగనన్న గృహ లబ్ధిదారులకు అవగాహన కల్పించి త్వరితగతిన నిర్మాణాలను పూర్తి చేసేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఈఓపీఆర్డీ అప్పాజీ, తదితరులు పాల్గొన్నారు.

ఉగాది నాటికి లక్ష్యాలను పూర్తి చేయాలి

అల్లూరు: మండలంలోని జగనన్న కాలనీ లేఅవుట్లలో గృహ నిర్మాణాల లక్ష్యాలను ఉగాది నాటికి పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి మృదులత అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గృహ నిర్మాణాలపై హౌసింగ్ అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో శనివారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉగాది రోజున సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న కాలనీ లేఅవుట్లలో గృహప్రవేశాలు చేయించనున్నారని తెలిపారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు మండలంలో గృహ నిర్మాణాలను పూర్తిచేసి గృహప్రవేశాలు చేయించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం టైలర్స్ కాలనీ, చవటపాళెం లేఅవుట్లను సందర్శించి గృహ నిర్మాణాల పురోగతిని పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీదేవి, కమిషనర్ ఫణికుమార్, హౌసింగ్ ఏఈ జమీర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.